సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

80 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలో సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు శనివారం ఉచితంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 80 మందికి సేవలు అందించారు. వైద్యులు దీపక్, రేష్మ, అనూష తదితరులు ఆర్థో, జనరల్ మెడిసిన్, కంటి వైద్య పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రికి తరలిస్తామన్నారు. ఈ ఉచిత వైద్య సేవలకు ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యదర్శి గెద్ద చిరంజీవి, ఆస్పత్రి సిబ్బంది కృష్ణ, జ్ఞానేశ్వర్ తదితరులు సహాయ సహకారాలు అందించారు.

చలివేంద్రాల ఏర్పాటు

తగరపువలస: దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల సంస్థ సహకారంతో చెరకుపల్లి జాతీయ రహదారికి ఇరువైపులా తాగునీరు, మజ్జిగ పంపిణీకి రెండు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ చలివేంద్రాలను ఏబీఎల్ సంస్థకు చెందిన ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ టీమ్ ఎగ్జిక్యూటివ్ రామస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో దివీస్ తరఫున డి.సురేష్‌కుమార్, పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

షిర్డీసాయి ధ్యాన మందిరం వార్షికోత్సవం రేపు

పద్మనాభం: మండల పరిధి శేరిఖండంలోని షిర్డీ సాయి ధ్యాన మందిరం 15వ వార్షికోత్సవాన్ని ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్లు ధ్యాన మందిరం చైర్మన్ సంగు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కాకడ హారతి, అనంతరం పంచామృత, విభూది, ఫల రస అభిషేకాలు జరుగుతాయని తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, పేదలకు వస్త్ర దానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పశువుల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ



కార్యక్రమంలో పాల్గొన్న పశు సంవర్ధకశాఖ, దివీస్ అధికారులు

తగరపువలస: ఆనందపురంలో దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో రూ.38.78 లక్షలతో నిర్మించనున్న పశువుల ఆస్పత్రికి శనివారం భూమిపూజ నిర్వహించారు. అప్పటివరకు ఆస్పత్రిని ఆనందపురం మార్కెట్‌లో ఉన్న పాత పంచాయతీ కార్యాలయంలో కొనసాగించనున్నారు. భూమిపూజ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.కరుణాకర్, డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ సజ్జా శ్రీనివాసరావు, స్థానిక సిబ్బంది, దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, చౌదరి, జగదీష్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెంలో విద్యుత్ కష్టాలు తొలగించాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు శనివారం వినతిపత్రం అందించారు. గ్రామంలో నిత్యం విద్యుత్ అంతరాయం కారణంగా ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో స్థానికులు ఉప్పాడ అప్పారావు, మరుపిల్ల శ్రీనివాసరావు, ముదిలి చిన్నయ్య పాత్రుడు, మరుపిల్ల సాయి, బాబాజీ, ఎం.సురేష్, లంకపల్లి నాని ఉన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ జగ్గరాజుపాలెంలో కొండల నుంచి శనివారం సాయంత్రం యంత్రాల సాయంతో ప్రైవేట్ లే అవుట్‌లకు కొందరు అక్రమంగా గ్రావెల్ తరలించుకు పోతున్నారని స్థానికులు ఆరోపించారు. ప్రతి శనివారం చీకటి పడిన తరువాత ఇదే తంతు సాగుతూ కొండలు తరిగిపోతున్నా వీఆర్వో, వీఆర్ఏలు అడ్డు చెప్పడం లేదని పేర్కొన్నారు. అలాగే తర్లువాడ, పందలపాక పంచాయతీలలోనూ గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్నందున రెవెన్యూ అధికారులు స్పందించి, అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వ కీర్తి.. ఆలయ శిఖర దీప్తి

అనంతుని భక్తుల కల నెరవేరనుంది. శిఖరం లేని ఆలయం అపచారమని వారు పడిన మనోవేదనకు తెర పడనుంది. అనంతుని ఆలయ శిఖర నిర్మాణం పూర్తయి రేపటి నుంచి ప్రతిష్టాపనోత్సవాలు జరగనుండటంతో భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నిధులు మంజూరు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.





భక్తులకు దర్శనభాగ్యం కలగనున్న గిరిపై అనంతుని విగ్రహం



గిరిపైకి తోడ్కొని వెళ్లనున్న శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలు

- గతంలో పిడుగు పడి శిథిలమైన అనంతుని ఆలయ **శిఖరం**
- వైఎస్సార్‌సీపీ **హయాంలో** రూ.60లక్షలు మం**జూరు**
- ఆ నిధులతో శిఖర **పునర్నిర్మాణం**
- రేపటి నుంచి శిఖర ప్రతిష్ట **ఉత్సవాలు**



గిరిపై హోమాలు నిర్వహణకు నిర్మించిన యాగశాల

పద్మనాభం: అరుదైనది అనంత పద్మనాభస్వామి ఆలయం. దేశంలో రెండు చోట్ల మాత్రమే ఈ స్వామి ఆలయాలున్నాయి. ఒకటి కేరళ రాష్ట్రం తిరువనంతపురం కాగా మరొకటి విశాఖ జిల్లాలోని పద్మనాభం. గిరిపై కొలువుదీరిన ఈ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు జిల్లా నుంచే కాకుండా పరిసర ప్రాంతాల నుంచీ అధిక సంఖ్యలో తరలి వస్తారు. అయితే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆలయ శిఖరంపై పిడుగుపడి శిథిలమైంది. అప్పట్లో ఆలయం నిర్లక్ష్యానికి గురైంది. శిఖరం లేకుండా ఆలయం ఉండడం అపచారమని పలువురు పేర్కొనడంతో గిరిపై అనంతుని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఆందోళన వ్యక్తం చేసేవారు.

గతేడాది ఫిబ్రవరిలో శ్రీకారం

భక్తుల మనోభావాలను అర్థం చేసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శిఖర పునర్నిర్మాణానికి ముందుకు వచ్చింది. రూ.60 లక్షలు సీజీఎఫ్ నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో గతేడాది ఫిబ్రవరి రెండో తేదీన శిఖర పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అర్ధ మండపం, ముఖ మండపం, విమాన గోపురం నిర్మించారు. కొత్తగా ఆలయానికి ఉత్తర, దక్షిణ దిక్కుల్లో మెట్లు ఏర్పాటు చేశారు. అనంతుని ఆలయానికి శిఖరం పునర్నిర్మించడంతో భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. భక్తుల విరాళాలతో ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఆలయంలో గ్రానైట్ వేయించారు. వైరింగ్ కూడా చేయించారు.



వాహనాల పార్కింగ్ కోసం శుభ్రం చేసిన సిమెంటు రోడ్డు

చురుగ్గా ఏర్పాట్లు

ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గిరిపై హోమాలు నిర్వహించడానికి యాగశాలను నిర్మించారు. కార్లు పార్కింగ్ చేసేందుకు సిమెంటు రోడ్డును పరిశుభ్రం చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు నేతృత్వంలో ఈ పనులు జరుగుతున్నాయి.

ఉత్సవాల షెడ్యూల్

- ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అనంత పద్మనాభస్వామి ఆలయ పునః, విమాన శిఖర ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఈ నెల 5న గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గ్రామంలో ఊరేగించి, గిరిపైకి తోడ్కొని వెళ్తారు.
- 6వ తేదీన వాస్తు పూజ, వాస్తు హోమం, **నవగ్రహ ఆరాధన,** విష్వక్సేనారాధన, రక్షా**బంధనం, మృత్సం**గ్రహణం, అంకురార్ప**ణం, అగ్నిమథనం,** అగ్ని ప్రతిష్టాపన వం**టి పూజాది కార్యక్ర**మాలు జరుగుతాయి.
- **7వ తేదీన విష్వక్సే**నారాధన, పుణ్యాహ**వచనం, పంచగవ్యా**ధివాసం, క్షీరాధివాసం **నిర్వహిస్తారు.**
- **8వ తేదీన అగ్ని ధ్యా**నాలు, అధివాస, జలా**ధివాస, శయనాధివా**సాలు, మహా మంత్ర **హోమం వంటి పూ**జా కార్యక్రమాలు జరు**గుతాయి.**
- **9వ తేదీ ఉదయం** విష్వక్సేనారాధన, అగ్ని **ధ్యానం, అంత హో**మం, రత్న, ధాతు, **బీజ, న్యాసాల అన**ంతరం అనంతుని ఆల**యంపై విమాన శి**ఖర ప్రతిష్ట వేద పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ జరుగుతుంది. అనంతరం ఇంతవరకు గర్భాలయంలో మూసి ఉన్న అనంతుని మూల విరాట్ విగ్రహాల దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పిస్తారు. తదుపరి శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణం నిర్వహిస్తారు.

సింహాచలం దుర్ఘటనకు ‘కూటమి’దే బాధ్యత

- అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే..
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



వేములవలసలో మాటాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: చందనోత్సవం నాడు గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన దుర్ఘటనకు ముమ్మాటికీ కూటమి ప్రభుత్వానిదే బాధ్యత అని వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండలం వేములవలసలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు ఇంటి వద్ద శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అక్కడ సంభవించిన మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. సింహగిరిపై చరిత్రలో తొలిసారిగా జరిగిన ఈ సంఘటనను ఉత్తరాంధ్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు.

మనోధైర్యం నింపింది జగన్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలను ఓదార్చి, ప్రభుత్వ తప్పిదాలను గుర్తు చేసి తీసుకోవలసిన చర్యల గురించి తెలియజేస్తే కూటమి ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ హేళనగా మాట్లాడటం తగదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఇటీవల విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా మృతుల కుటుంబాలను కూడా మొట్ట మొదటి పరామర్శించి వారిలో మనోధైర్యం నింపింది వైఎస్ జగన్ అన్నారు. చందనోత్సవానికి మంత్రుల కమిటీ భక్తుల వసతులపై దృష్టి సారించలేదన్నారు. చందనోత్సవానికి ఏటా 2 లక్షల మంది భక్తులు వస్తారని తెలిసినా వారికి సక్రమంగా దర్శనాలు కల్పించలేకపోయారన్నారు.

మంత్రులు నైతిక బాధ్యత వహించాలి

డిజైన్, టెండర్, అనుమతులు లేకుండానే ఆదరాబాదరగా గోడను నిర్మించమని ఒత్తిడి చేసినట్టు స్వయంగా కాంట్రాక్టర్ త్రిసభ్య కమిటీ ముందు తెలిపారన్నారు. కేవలం ఉత్సవానికి 5, 6 రోజుల ముందు మాత్రమే గోడ నిర్మించి ప్రమాదానికి కారణమైన మంత్రులు నైతిక బాధ్యత వహించాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రసాదం స్కీం కింద సింహాచలం అభివృద్ధికి 2022–23లో రూ.54 కోట్లు కేంద్రంతో మంజూరు చేయించామన్నారు. గతేడాది నవంబరు నాటికి రూ.13.69 కోట్లు నిధులు విడుదల కాగా 28 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అందులో ఈ గోడ లేదని స్పష్టం చేశారు.

ప్రకృతి వైపరీత్యం అయితే ఒక్క గోడే ఎందుకు కూలింది?

ప్రకృతి వైపరీత్యం కారణంగా గోడ కూలితే వైఎస్ జగన్ రాద్ధాంతం చేస్తున్నట్టు కూటమి నేతలు, ఒక వర్గం మీడియా చేస్తున్న ప్రచారం హాస్యాస్పదంగా ఉందన్నారు. సామాన్య భక్తుల అరణ్యరోదన పట్టని చంద్రబాబు, పవన్‌లు ఇటువైపు చూడక పోగా బాధిత కుటుంబాలను ఓదార్చిన వైఎస్ జగన్‌పై రాజకీయ విమర్శలు చేయడం దారుణమన్నారు. ప్రకృతి వైపరీత్యం అయితే ఒక్క గోడే ఎందుకు కూలుతుందని ప్రశ్నించారు. కొత్తగా కట్టిన గోడ పక్కనే రూ.300 క్యూ లైన్ పంపించడం ప్రభుత్వ వైఫల్యమన్నారు. కూటమి ప్రభుత్వం నిర్మించిన గోడ కారణంగానే ఎంతో భవిష్యత్తు కలిగిన ఒక సాఫ్ట్‌వేర్ జంట ప్రాణాలు కోల్పోయిందన్నారు. మృతుల కుటుంబాల భవిష్యత్తు కోసమే రూ.కోటి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం కోసం వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. 2029లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మిగిలిన పరిహారం బాధితుల కుటుంబాలకు ఇస్తామన్నారు. మాట ఇస్తే నిలబెట్టుకునే దేశంలో ఏకైక బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ జగన్ అన్నారు. ఎల్జీ పాలిమర్స్ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు అప్పటి సీఎం జగన్ రూ.కోటి వంతున పరిహారం ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, కోరాడ లక్ష్మణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, గంద్రెడ్డి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బొట్ట రామకృష్ణ, పిన్నింటి వెంకటరమణ, బోని అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, పాండ్రంగి అప్పారావు, మైలపల్లి షణ్ముఖరావు, శీరపు అప్పలరెడ్డి, కోరాడ అప్పలస్వామినాయుడు, గుడ్ల పోలిరెడ్డి, పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు, షిణగం దామోదరరావు, కొలుసు ఈశ్వరరావు, కాళ్ల గౌరి, చందక సూరిబాబు, కోరాడ ముసలినాయుడు, రౌతు వెంకటరావు, పినిశెట్టి సింహాచలం నాయుడు, రౌతు శ్రీను, నీలాపు సురేష్‌రెడ్డి, చందక అప్పలస్వామి, గొలగాని వెంకట అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు



పంచాయతీ విస్తరణాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధి కూలీలు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కూలీలు పంచాయతీ విస్తరణాధికారి సత్యనారాయణను కోరారు. శనివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేరుతో అచ్చిబాబు, మూర్తి, వెంకటరావు, రాంబాబు, శివకృష్ణ, శ్రీను తదితరులు ఉపాధిహామీ పనుల్లో అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వీఆర్పీ, మేట్‌లు కలిసి అంతులేని అవినీతికి పాల్పడుతున్నందున, వారిని తొలగించి కొత్తగా నియామకాలు జరపాలని కోరారు.

డివైడర్లపై పచ్చదనం మాయం

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు విజేత సూపర్ మార్కెట్–సాంకేతిక కళాశాల మాస్టర్ ప్లాన్ రోడ్డులో మొక్కలన్నీ ఎండిపోయాయి. గతేడాది లక్షల రూపాయలు వెచ్చించి, సుమారు 300మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేసి, సెంటర్ డివైడర్‌పై వివిధ రకాల మొక్కలు నాటించారు. ఎన్నికల తర్వాత వీటి సంరక్షణను గాలికి వదిలేయడంతో మొక్కలన్నీ ఎండిపోయాయి. ఈ రోడ్డంతా ఇదే పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ అధికారులు గానీ, సిబ్బంది గానీ వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పటికైనా స్పందించి పచ్చదనాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



డివైడర్‌పై ఎండిపోయిన మొక్కలు

చిట్టివలసలో మే డే సంబరాలు

తగరపువలస: భీమిలి డివిజన్ సిటు ఆధ్వర్యంలో శనివారం చిట్టివలసలో మేడే సంబరాలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతోందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు పంపాన సూర్యనారాయణ, దల్లి రాంబాబు విప్లవగీతాలు ఆలపించారు. చిన్నారులు కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నాయకులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు, కె.నాగరాణి, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

జెడ్పీ కనకమహాలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్ నగర్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన ‘సమస్యలతో సహవాసం’ కథనానికి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి స్పందించారు. శనివారం సాగర్‌నగర్‌లోని అన్ని ప్రాంతాల్లో పర్యటించిన ఆమె స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ పర్యవేక్షణలో వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై చర్యలు తీసుకుంటామని, శిథిలావస్థకు చేరుకున్న పార్కులను పరిశీలించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా అధికారులు తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. స్థానికులు ఏ సమస్య తెలిపినా సచివాలయ సిబ్బంది తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



వీధిలైట్ల ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న జెడ్పీ కనకమహాలక్ష్మి

మనస్థాపంతో వృద్ధుడి ఆత్మహత్య



సన్యాసినాయుడు (ఫైల్)

పద్మనాభం: మనస్థాపంతో బలవన్మరణానికి పాల్పడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. మద్ది గ్రామానికి చెందిన కంటుబోతు సన్యాసినాయుడు(60) కుమారుడు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో మనస్థాపానికి గురైన సన్యాసినాయుడు మద్యానికి బానిసయ్యాడు. సన్యాసినాయుడికి భార్య రమణమ్మ, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. ఈ క్రమంలో శుక్రవారం రమణమ్మ కూలిపనికి వెళ్లిన సమయంలో సన్యాసినాయుడు పురుగుల మందు తాగాడు. సాయంత్రం ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి సన్యాసినాయుడికి వాంతులవుతుండటంతో ఆయన్ను విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో సన్యాసినాయుడు మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రంలో వసతులు కరువు

సాయంత్రమైతే మందుబాబుల గొడవ

మధురవాడ: మారికవలస తుఫాన్ రక్షిత భవనంలో ఏర్పాటు చేసిన మహిళా కుట్టుమిషన్ కేంద్రంలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. జీవీఎంసీ 5, 6, 7 వార్డులకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి శిక్షణను ఇచ్చేందుకు ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇక్కడ 2 షిఫ్టుల్లో 120మంది మహిళలు కుట్టుశిక్షణ పొందుతున్నారు. దీనినే మహిళా కేంద్రంగా ఉపయోగిస్తుండటంతో స్వయం సహాయక సంఘాల సమావేశాల తరచూ జరుగుతాయి. అయితే, ఇక్కడ తాగునీరు గానీ, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం గానీ లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రానికి ఎదురుగా అక్రమ దుకాణాలు ఉండడంతో కాస్త చీకటి పడినా ఆ ప్రాంతం మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది.వారు మద్యపానం, పొగ తాగడం చేస్తూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎంట్రన్స్‌లో అస్తవ్యస్తంగా పరిసరాలు

ప్రతి ఒక్కరూ హక్కులు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మంజుల

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ తమ హక్కుల గురించి తెలుసుకోవాలని భీమిలి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మంజుల అన్నారు. పారిశుధ్య కార్మికులకు న్యాయపరమైన హక్కుల గురించి శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తారని, దానికి తగిన విధంగా వారికి గౌరవం లభించాలని అన్నా రు. వారికి ఏదైనా ఇబ్బందులు, సమస్యలు వస్తే కోర్టుల ద్వారా న్యాయాన్ని పొందవచ్చని తెలిపారు. కోర్టు పనితీరు, కేసుల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి కనకమహాలక్ష్మి, లేబర్ అధికారి ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ రామశర్మ పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారి అభిషేకానికి జలాలను తీసుకువెళ్తున్న మహిళలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట గ్రామదేవత ఎర్నిమాంబ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. శనివారం తొలేళ్ల పండగ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. మహిళలు కలశాలతో జలాలను తీసుకువచ్చి, అమ్మవారిని ప్రత్యేకంగా అభిషేకించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

28వ వర్ధంతి



మహామనిషి,
మా నుండి దూరమై
నేటికి 28 సంవత్సరాలు
గడిచిననూ
ఎప్పటికీ మీ స్మృతులను
స్మరిస్తూ మీకు భగవంతుడు
ఆత్మ శాంతిని కలిగించాలని
ప్రార్థిస్తున్నాము..
కీ.శే. బోని కనకయ్య నాయుడు గారు
(బోని గ్రామ మునసబు)
జననం: 29-01-1918 - మరణం: 04-05-1997
కుమారుడు : బోని శివ సూర్యనారాయణ
B.Sc., (Ag), CCMT (London), M.ABS (IND)
మరియు బోని గ్రామ ప్రజలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో
మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com